

గోల్డ్ మ్యాన్

మెడలో లావుపాటి గొలుసు. చేతులకు పెద్దపెద్ద కడియాలు. వేళ్లకు ఉంగరాలు. ఇలా ఒంటిపైన రూ.కోటికిపైగా బంగారంతో సోమవారం తిరుపతి కలెక్టరేట్‌కు వచ్చారు వ్యాపారి షణ్ముఖం. ఈయన్ను అర్జీదారులు ఆసక్తిగా చూశారు. 'గోల్డ్ మ్యాన్' అంటూ ఆయన్ను పలువురు పిలిచారు. తిరుమలలో తనకు హోటల్ వ్యాపారం ఉందని, చిన్నపనిపై కలెక్టరేట్‌కు వచ్చానని ఆయన చెప్పారు.

- తిరుపతి కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యం



కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సదాశివం

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఆ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవనంలో సోమవారం ఏపీ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. టీడీపీలో కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని చెప్పడానికే తానే నిదర్శనమన్నారు. స్టేట్ డైరెక్టర్లు, జిల్లాల నుంచి హాజరైన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుల సమక్షంలో సదాశివం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను పలువురు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

కార్తీక సందడి

కార్తీక మాసం నాలుగో సోమవారం. జిల్లాలోని శైవాలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆయా ఆలయాల ప్రాంగణాలు, పుష్కరిణిల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. పిండి తలిగలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

కార్తీక దీపాల వెలుగులు 8లో



ఆంగ్లోపాధ్యాయుడు

శ్రీనివాసులు సస్పెన్షన్

తిరుపతి(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి):తిరుపతిలోని రాజీవ్ గాంధీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు జె. శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి డీఈవో కేవీఎన్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.కొన్ని సంవత్సరాలుగా ఎక్కడ పనిచేస్తే అక్కడ వివాదాస్పదంగా వ్యవహరిస్తుండడంతో శ్రీనివాసులును సస్పెండ్ చేసినట్టు ఆయన వివరించారు.డీఈవో కథనం మేరకు... స్కూల్ అసిస్టెంట్ జె. శ్రీనివాసులు 2017లో పాకాలలోని జడ్పీ హైస్కూల్లో పని చేసినప్పుడు ప్రాజెక్ట్ వర్క్ చేయలేదని విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టడంతో విచారణ జరిపి తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు.సత్యవేడు మండలం దాసకుప్పం జడ్పీ హైస్కూల్లో పనిచేసినపుడు తరచూ హెచ్‌ఎంతో పాటు సహోపాధ్యాయులతో గొడవపడుతుండడంతో శాఖాపరమైన విచారణ జరిపి తిరుపతికి బదిలీ చేశారు.తిరుపతిలోని రాజీవ్‌గాంధీ కాలనీ జడ్పీహెచ్‌కు బదిలీపై వచ్చిన తరువాత ఇక్కడి ప్రధానోపాధ్యాయుడితో, సహోపాధ్యాయులతో గొడవపడడం ప్రారంభించడంతో ఉప విద్యాశాఖాధికారి ఆనంద్ రెడ్డి విచారణ జరిపారు. ప్రశాంతంగా సాగాల్సిన బోధన శ్రీనివాసులువల్ల కుంటుపడుతోందని, ఆయన్ను వేరే పాఠశాలకు బదిలీ చేయాలని నివేదిక ఇచ్చారు. దీంతో శ్రీనివాసులును ఎస్వీజేఎస్‌ఎం పాఠశాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద బదిలీ చేశారు.అయితే అక్కడి ప్రధానోపాధ్యాయుడు తన మెడికల్ బిల్లులు పాస్ చేయలేదని, తోటి ఉపాధ్యాయులు తనని ఇబ్బంది పెడుతున్నారనే అభియోగాలతో శ్రీనివాసులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు ప్రస్తుత ఉప విద్యాశాఖాధికారి బాలాజీ విచారణ జరిపించారు. అయితే ప్రధానోపాధ్యాయుడు కానీ, ఇతర ఉపాధ్యాయులు కానీ శ్రీనివాసులును ఏవిధంగానూ ఇబ్బంది పెట్టలేదని విచారణాధికారి నివేదిక సమర్పించారు. ఇదిలా ఉండగా గతంలో దాసకుప్పం ఘటనలపై విచారణ జరిపిన త్రిసభ్య కమిటీ సభ్యులతో పాటు కొందరు అధికారులపై పలురకాల ఆరోపణలు చేస్తూ... తన వాట్సాప్ గ్రూప్‌లో అసభ్యకరమైన మాటలతో వీడియోలు, సందేశాలను శ్రీనివాసులు పంపించారు. అలాగే తనపై విచారణ జరిపిన తిరుపతి ఉప విద్యాశాఖాధికారిపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన ప్రచారం చేయడం ప్రారంభించారు.ఈ విషయంపై ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ డీఈఓకు ఇటీవల ఫిర్యాదు చేశారు.దీనిపై సంజాయిషీ కోరుతూ శ్రీనివాసులుకు డీఈవో నోటీసు జారీ చేశారు. అయితే సంజాయిషీలో పొంతనలేని సమాధానం ఇచ్చారని డీఈవో వెల్లడించారు.ఎన్నిసార్లు హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీనివాసులును సస్పెండ్ చేసినట్టు డీఈవో తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం

రూ.4.14 కోట్లు

తిరుమల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామికి హుండీ ద్వారా రూ.4.14 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించింది. ఈ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 75,737 మంది శ్రీవారిని దర్శించుకోగా, 23,208 మంది తలనీలాలు సమర్పించారు

నేడు జాతీయ పాల దినోత్సవం

రైతుకు భరోసా పాడి

నేల.. రైతు నమ్మకాన్ని వమ్ము చేసినా, పశువు రైతుకు అమ్మగా మారింది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు, ధరల ఒడిదుడుకులు చేసిన కష్టాన్ని వెక్కిరించి ఆత్మహత్యల దిశగా నడిపిస్తే.. పెంచిన పశువు మాత్రం పాల ధారతో రైతు బతుక్కి భరోసాగా నిలచింది. తిరుపతి జిల్లాలో రెండు లక్షల కుటుంబాలకు పాడి పరిశ్రమే ఉపాధిగా మారింది. 2.59 లక్షల పాడియావులు, 2.69 లక్షల గేదెలు పాడి రైతును కాపాడుతున్నాయి.

తిరుపతి

ఆంధ్రజ్యోతి

రోజూ 13.61 లక్షల లీటర్ల పాలు

జిల్లాలో ఆవులు, గేదెల సంఖ్య 5 లక్షలకు పైగా వున్నా వాటిలో పాలిచ్చే ఆవులు 1.17 లక్షలు మాత్రమే. అలాగే పాలిచ్చే గేదెలు 97 వేలు. వీటి ద్వారా రోజువారీ 13.61 లక్షల లీటర్ల పాల దిగుబడి వస్తోంది. ఇందులో 1.35 లక్షల లీటర్ల పాలు రైతు కుటుంబాలు వినియోగిస్తుండగా 12.26 లక్షల లీటర్ల పాలను వివిధ ప్రభుత్వ, సహకార, ప్రైవేటు డెయిరీలు సేకరిస్తున్నాయి.

జిల్లాలో ఉన్న గేదెలు

దేశవాళీ గేదెలు, ముర్రా జాతి గేదెలు, గ్రేడెడ్ ముర్రా జాతి గేదెలు వంటి రకాలున్నాయి.





ఇల్లు గడుస్తోంది

బర్రెల పెంపకంతోనే మాకు ఇల్లు గడుస్తోంది. మాకున్న రెండు ముర్రాజాతి బర్రెల్లో ఒక్కోటి ఉదయం ఐదు లీటర్లు, సాయంత్రం ఐదు లీటర్లు చొప్పున రోజుకు 20 లీటర్ల పాలిస్తున్నాయి. ఆ పాలు అమ్మడం ద్వారానే పిల్లల్ని కూడా చదివించుకుంటున్నా.

-చిరంజీవి, నాగవోలు గ్రామం, డక్కిలి మండలం

జిల్లాలో ఉన్న ఆవులు

నాటు లేదా దేశవాళీ ఆవులు, ఒంగోలు జాతి ఆవులు, జెర్సీ సంకర జాతి ఆవులు, హెచ్‌ఎఫ్ సంకర జాతి ఆవులు, హలికర్, పుంగనూరు జాతి ఆవులు వంటి రకాలున్నాయి. ఇందులో హలికర్, పుంగనూరు జాతుల ఆవుల సంఖ్య చాలా స్వల్పం.

47 డెయిరీలు

జిల్లాలో మొత్తం 47 డెయిరీలున్నాయి. అందులో నాలుగు ప్రభుత్వ సహకార రంగానికి చెందినవి కాగా మిగిలిన 43 డెయిరీలు ప్రైవేటువి. చిల్లింగ్ సెంటర్లు 19 వుండగా అందులో సహకార రంగానికి చెందినవి మూడు కాగా మిగిలిన 16 ప్రైవేటువి. ఇవి కాకుండా డీఆర్‌డీఏ పరిధిలో జిల్లా మహిళా సమాఖ్య నిర్వహిస్తున్న బీఎంసీయూలు 15 వున్నాయి. 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటైన ఈ బీఎంసీయూల పరిధిలో 401 పాల సేకరణ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటి ద్వారా 6354 మంది పాడి రైతులు 41,670 లీటర్ల పాలను బీఎంసీయూలకు సరఫరా చేస్తున్నారు.

18 లీటర్ల పాలిచ్చే ఆవులు

ఆవు జాతుల్లో హెచ్‌ఎఫ్ సంకర జాతి, జెర్సీ సంకర జాతి ఆవులు పాల దిగుబడి అధికంగా ఇస్తున్నాయి. హెచ్‌ఎఫ్ జాతి ఆవు సగటున రోజుకు 16-18 లీటర్ల పాలు ఇస్తుండగా జెర్సీ ఆవు రోజుకు సగటున 10-14 లీటర్ల పాలు ఇస్తుంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పదిలక్షలకు పైగా ఆవులు, ఎనుములు ఉండేవి. పాడి ఉత్పత్తిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండేది. విభజన తర్వాత ఏర్పడిన తిరుపతి జిల్లా ఆ స్థానాన్ని కోల్పోయినా రైతుకు భరోసాని కొనసాగిస్తూనే ఉంది. సెంటు భూమి లేకున్నా, ఉద్యోగ వ్యాపారాలు లేకున్నా లక్షల కుటుంబాలు పాడి మీద ఆధారపడి సంతోషంగా జీవించగలుగుతున్నాయి.

12 లీటర్ల పాలిచ్చే గేదెలు

గేదె జాతుల్లో ముర్రా, గ్రేడెడ్ ముర్రా జాతుల గేదెలు ఎక్కువగా పాల దిగుబడి ఇస్తున్నాయి. ముర్రా జాతి గేదె సగటున రోజుకు 11-12 లీటర్ల పాలు ఇస్తుంది. గ్రేడెడ్ ముర్రా జాతి గేదె సగటున 6-8 లీటర్లు చొప్పున ఇస్తుంది.

గేదెలు.. రకాలు	
నాటు గేదెలు:	1.02 లక్షలు
గ్రేడెడ్ ముర్రా జాతి:	1.21 లక్షలు
ముర్రా గేదెలు:	32,500



ఇదే పుంగనూరు ఆవు!

కోట మండలం గూడలి గ్రామంలో రైతు కన్నా వెంకట శేషయ్య పోషిస్తున్న పుంగనూరు జాతి ఆవు ఇది. చూడ్డానికి దూడలా ముచ్చటగొలుపుతున్న ఈ పొట్టిరకం ఆవు రోజుకు ఏడు లీటర్ల దాకా పాలిస్తోంది. దీన్ని పలమనేరు మండలం బంగారుపేట నుంచీ రెండేళ్ళ కిందట రూ. 40 వేలు పెట్టి కొనుగోలు చేశారాయన. స్థానికంగా పుంగనూరు జాతి ఆవులను మల్నాడు గిడ్డ రకం ఆవులుగా పిలుస్తారు.



రైతుకి ధైర్యం.. ముర్రాజాతి

చిల్లకూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి గ్రేడెడ్ ముర్రా జాతి గేదెలు పోషిస్తున్నారు. అవి ఒక్కోటి రోజుకు ఉదయం నాలుగు, సాయంత్రం నాలుగు లీటర్ల పాలిస్తున్నాయి. జెర్సీ, హెచ్‌ఎఫ్ రకాల ఆవులతో పోలిస్తే ఎలాంటి వాతావరణానికైనా ఈ గేదెలు తట్టుకుంటాయని, పెద్దగా వ్యాధులు సోకే పరిస్థితి కూడా వుండదని వెంకటరెడ్డి చెబుతున్నారు.



గ్రేడెడ్ ముర్రా జాతి గేదె

తడ మండలం కొండూరుకు చెందిన రైతు పొదిలి మునిప్రసాద్ పోషిస్తున్న గ్రేడెడ్ ముర్రా జాతి గేదె రోజుకు 12 లీటర్ల పాలిస్తోంది.

ఆవులు-రకాలు	
నాటు ఆవులు:	57,500
ఒంగోలు జాతి:	29,119
జెర్సీ:	98,600
హెచ్‌ఎఫ్ సంకర జాతి:	43,200

52 కిలోల గంజాయి స్వాధీనం

- తిరుపతిలో 30, రేణిగుంటలో 22 కిలోలు
- రెండు ఘటనల్లో 8 మంది అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, రేణిగుంటలో సోమవారం 52 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ రెండు ఘటనల్లో 8 మందిని అరెస్టు చేశారు. తిరుపతిలో గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్న ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితులను ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. అనకాపల్లి జిల్లా గొల్లపేటకు చెందిన గవిరెడ్డి రమణమ్మ, తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా కంపుకాలపట్టికి చెందిన విజయ కన్నుకాన్, పోచంపల్లి తాలూకా బేరుహల్లికి చెందిన మల్లిక కేశవన్, తొట్టాతుకారన్ కొట్టైలో ఉంటున్న రాజామధు, అల్లూరు సీతారామరాజు జిల్లా బొర్రి గ్రామానికి చెందిన సంధ్యారాణి టీమ్‌లుగా ఏర్పడి ఒడిశా, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించుకుని తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని బ్యాచ్‌లకు సరఫరా చేస్తున్నారు. వీరిలో రమణమ్మ పలు చోట్ల గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితురాలు. అరెస్టయి బయటకు రావడం.. మళ్లీ గంజాయి వ్యాపారం చేస్తోంది. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన మంజునాథ, విజయ, మల్లిక ఎక్కువ మొత్తంలో గంజాయి అవసరమని ఈమెను సంప్రదించారు. నర్సీపట్నంకు చెందిన అప్పారావును ఆమె సంప్రదించగా రూ.1.50 లక్షలు విలువ చేసే 30 కిలోల గంజాయిని విక్రయించాడు. ఈ గంజాయిని సంధ్యారాణి సహాయంతో తిరుపతికి తీసుకొచ్చారు. అప్పటికే తిరుపతిలో వేచి ఉన్న విజయ, మల్లిక, మరో సహాయకుడు రాజుకు ఆర్టీసీ బస్టాండు వద్ద అప్పగించి.. అందరూ కలసి బయటకు వెళుతున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, ఎస్‌ఐ బాలకృష్ణ, మహిళా పోలీసు సిబ్బందితో కలిసి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెద్ద మొత్తంలో గంజాయి సరఫరా చేస్తున్న అప్పారావు, మంజునాథ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరందరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు.



నిందితులను చూపుతున్న ఈస్ట్ పోలీసులు



వడ్డీ కారుణ్య తేజ - పాత్రో ఉగాది - సతీష్

రేణిగుంటలో పట్టుబడిన

గంజాయి స్మగ్లర్లు

రేణిగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట రూరల్ సీఐ మురళీకృష్ణ సోమవారం వివరాలను వెల్లడించారు. రేణిగుంట సంతగేటు వద్ద సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో గాజులమండ్యం ఎస్‌ఐ టి.వి.సుధాకర్‌తో పాటు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను పరిశీలించగా అందులో గంజాయిని గుర్తించారు. వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా నగరికి చెందిన సతీష్, విశాఖకు చెందిన పాత్రో ఉగాది, వడ్డీ కారుణ్యతేజ అని తేలింది. వారు నగరి, తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తుంటామని తెలిపారు. నర్సీపట్నానికి చెందిన మహిళ దగ్గర కొనుగోలు చేసినట్లు వివరించారు. దీంతో 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిని పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

న్యాయం చేయాలని కలెక్టరేట్లో వృద్ధురాలి ఫిర్యాదు

- పోలీస్ స్టేషన్‌కు రావాలని ఎస్‌ఐ ఫోన్
- స్టేషన్లోనే బాధితులపై ప్రత్యర్థుల దాడి
- ఘటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తనకు, తన బంధువైన లోకనాథరెడ్డికి చిన్నపాటి భూవివాదం నడుస్తోందని, అతడి మాటలు విని తిరుచానూరు పోలీసులు తనను ఇబ్బంది పెడుతున్నారని కన్నెమ్మ అనే వృద్ధురాలు సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడే విధుల్లో ఉన్న ఎస్‌ఐ ఈ విషయం తెలుసుకుని ఫిర్యాదుదారును స్టేషన్‌కు రమ్మని చెప్పాడు. అక్కడికి వెళ్లగానే ఎస్‌ఐ ఎదుటే కన్నెమ్మతో పాటు మరో ఇద్దరిపై పోలీసులు సాక్షిగా ప్రత్యర్థి వర్గం దాడి చేసింది.తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వేదికగా జరిగిన ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు కన్నెమ్మ, ఆమె సమీప బంధువు భాస్కర్ ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ పాతూరుకు చెందిన కన్నెమ్మకు తన సమీప బంధువు లోకనాథరెడ్డితో భూసమస్య వుంది. అయితే తిరుచానూరు పోలీసుల నుంచీ లోకనాథరెడ్డి పదేపదే తనపై ఒత్తిడి తీసుకువస్తూ బెదిరింపులకు దిగుతున్నాడని ఎస్‌ఐ సాయినాథచౌదరిపై, లోకనాథరెడ్డిపై కలెక్టరేట్లో సోమవారం కన్నెమ్మ ఫిర్యాదు చేశారు.అక్కడే విధుల్లో ఉన్న ఎస్‌ఐ సాయినాథచౌదరి ఈ విషయం తెలుసుకుని తక్షణమే స్టేషన్‌కు రావాలని కన్నెమ్మకు, అతని మనవడు చెంగారెడ్డికి ఫోన్ చేశారు.దీంతో వారు సోమవారం మధ్యాహ్నం సమీప బంధువు భాస్కర్‌తో కలిసి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే అక్కడ లోకనాథరెడ్డి, అతని కుమారుడు, మరదలు అంకమ్మ స్టేషన్లో ఉన్నారు. ఎస్‌ఐ సాయినాథచౌదరి ఎదుటే వారు ఫిర్యాదుదారులు కన్నెమ్మ, చెంగారెడ్డి, భాస్కర్‌లపై దాడి చేశారు. ఇదేమన్యాయం సార్? ఎస్‌ఐగా ఉండి మీరు వారిని ఆపకుండా.. దగ్గరుండి కొట్టిస్తారా అంటూ కన్నెమ్మ సమీప బంధువు భాస్కర్ విలపిస్తూ ఎస్‌ఐ సాయినాథచౌదరిని ప్రశ్నించారు. అయితే బాధితులనే బయటికి వెళ్లాలని పోలీసులు గదమాయించడం కొసమెరుపు.ఈ విషయం తెలిసిన కలెక్టర్ వెంకటేశ్వర్ వెంటనే స్పందించి ఎస్పీ సుబ్బరాయుడితో చర్చించి విచారణ జరిపించమన్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఓ కీలకనేత అండ చూసుకుని ఎస్‌ఐ ఇలా వ్యవహరిస్తున్నాడని స్థానికులు విమర్శిస్తున్నారు.



కన్నెమ్మ వర్గీయులతో ప్రత్యర్థి వర్గీయురాలి వాగ్వాదం

రైతులకు నష్టపరిహారం అందిస్తాం



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఎగవూరు దిగువూరు గ్రామాలలో ఏనుగులు నష్టపరిచిన పొలాలను సోమవారం ఆయన సందర్శించారు. బాధిత రైతులతో మాట్లాడారు. పంట నష్టంపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతానన్నారు. కాగా ఆదివారం ఎగవూరు గ్రామానికి చెందిన రైతు రెడ్డమ్మకు చెందిన వరి ధాన్యాన్ని ఏనుగులు తినేశాయి. చంద్రయ్య, అమరేంద్రకు చెందిన టమోటా తోటను తొక్కేశాయి. ఫెన్సింగ్ కూసాలను విరిచేశాయి. అదే గ్రామానికి చెందిన చంగల్రాయులకు చెందిన టమోటా, మామిడి తోటలు, సిద్దయ్యకు చెందిన టెంకాయ చెట్లు పైపులైను ధ్వంసం చేశాయి. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్చార్జి శివకుమార్, వైస్ ఎంపీపీ సునీత దామోదర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న మోహిత్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు

తిరుపతిరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వగృహంలో సోమవారం సాయంత్రం అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. తొలిసారిగా అయప్ప మాలధారణ చేసిన ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ద్వారా పడిపూజని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి దీపారాధన చేస్తూ మొక్కు చెల్లించారు. మాలధారణ భక్తులకు అన్నదానం చేశారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు



ముక్కోటిలో లక్ష బిల్వార్చన అలంకరణలో స్వామివారు

చంద్రగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో సోమవారం కార్తీకమాస పూజలు వైభవంగా నిర్వహించారు. తొండవాడ వద్ద అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం, అనందవల్లిదేవికి అభిషేకం చేశారు. బిల్వార్చన చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. దీపారాధన నిర్వహించారు. చంద్రగిరి శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి, రుద్రాక్షుల అలంకరణ చేశారు. సాయంత్రం గవ్వల అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

విజయభాస్కర్‌కు ఎమ్మెల్యే నివాళి



చంద్రగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత దుబాసి రామ్మూర్తి అన్న కుమారుడు దుబాసి విజయ్‌భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చాడు. దుబాసి రామ్మూర్తి, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, నాయకులు రమేష్ రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు

చంద్రగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద మంగళవారం చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని వెటర్నరీ యూనివర్సిటీ ఆప్కాస్ యూనియన్, సీఐటీయూ తిరుపతి రూరల్ కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం వారు కరపత్రం ఆవిష్కరణ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ తిరుపతి రూరల్ కన్వీనర్ గండికోట నాగ వెంకటేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

కోటిలింగేశ్వరస్వామి ఆలయం ప్రారంభం



ప్రత్యేకాలంకారంలో కోటి లింగేశ్వరస్వామి - కల్యాణం

రామచంద్రాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కామాక్షి సమేత కోటిలింగేశ్వరస్వామి ఆలయం ప్రారంభమైంది. మూడు రోజులుగా వివిధ కృతువులు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 5 గంటలకు కామాక్షిదేవి, 108 శివలింగాలు, కోటిలింగేశ్వరస్వామిని ప్రతిష్ఠించారు. 10 గంటలకు శుద్ధ జలంతో వివిధ దేవతామూర్తులను సంప్రోక్షణ అనంతరం కుంభాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం, అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు రాత్రి ఊంజల్‌సేవ అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

యువతా సోషల్ మీడియాతో జాగ్రత్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

పాకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో యువత జాగ్రత్తగా వ్యవహరించాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మద్దయ్య ఆచారి కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోషల్ మీడియా దుర్వినియోగం - సైబర్ బెదిరింపులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అత్యాశకు పోయి వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్‌కార్డుల వివరాలు అపరిచిత వ్యక్తులకు ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో మాశిలామణి, ఎన్‌సీసీ అధికారి ఈశ్వరబాబు, అధ్యాపకులు మాధవి, రేఖ, వినోద్ పాల్గొన్నారు.

రాజశేఖర్‌నాయుడు కుటుంబానికి పరామర్శ

ఎర్రావారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) ; టీడీపీ నాయకుడు బోడిపాటి రాజశేఖర్ నాయుడు కుటుంబాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించారు. బోడేవాండ్లపల్లె గ్రామం వలసపల్లెలో రాజశేఖర్ నాయుడు తల్లి అమ్మత్ (80) మరణించింది. సోమవారం ఎమ్మెల్యే నాని వలసపల్లెకు వచ్చి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దేశిరెడ్డి రఘునాథ, మహేష్ నాయుడు, అన్నసముద్రం మధు,వెంకట శివరామి రెడ్డి ,వేణుగోపాల్ , తలకోన ట్రస్ట్ చెర్మన్ సోమనాథ రెడ్డి, కుమార్ ,విశ్వనాథ రెడ్డి,కేశవుల నాయుడు,బాబు అశోక్ రెడ్డి, హరిశ్చంద్ర,మురళి, సిద్ధకుమార్ ,చిన్నపరెడ్డి, నిరంజన్ ,బాబు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యరాశిని ధ్వంసం చేసిన ఏనుగులు



భాకరాపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి); కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని గజరాజులు తిని, తొక్కి ధ్వంసం చేశాయి. చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు పంచాయతీ బొగ్గలవారిపల్లెకు చెందిన మహిళా రైతు చట్టి రెడ్డెమ్మ తన రెండెకరాల్లో వరి పండించారు. పంటను కోసి బండమీద రాశిగా పోసి పట్టా కప్పి ఉంచారు. ఏనుగులు దాదాపు 30 వరి బస్తాల ధాన్యాన్ని తిని, ధ్వంసం చేశాయి. అలాగే మామిడి తోట, వరి పొలాలకు రక్షణగా వేసిన 50 రాతి కూసాలను విరిచేశాయి. రూ.లక్ష నష్టపోయినట్లు రైతులు తెలిపారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ ఇమ్రాన్ బాషా

ఎర్రావారిపాలెం/భాకరాపేట (ఆంధ్రజ్యోతి) : విద్యాలయాల పరిసరాల్లో ఆటోడ్రైవర్లు నడుచుకోవాల్సిన తీరుపై భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా కౌన్సెలింగ్ ఇచ్చారు. భాకరాపేట జిల్లా పరిషత్ పాఠశాల ఎదుట ఉన్న స్టాండ్‌లోని ఆటో డ్రైవర్ల లైసెన్సులు పరిశీలించారు. వారి వ్యక్తిగత వివరాలు తెలుసుకున్నారు. బాలికలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్ల సమగ్ర వివరాలు సేకరించి ఉంచుకోవాలని ఎస్సై రాఘవేంద్రను ఆదేశించారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

రామచంద్రాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిపందేల స్థావరాలపై ఆర్‌సీపురం పోలీసులు సోమవారం మెరుపుదాడులు నిర్వహించారు. యాగప్పరెడ్డికండ్రిగ సమీపంలోని చెరువు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని 16 ద్విచక్ర వాహనాలు, రెండు కోడిపుంజులు, రూ.1,480 నగదును స్వాధీనం చేసుకున్నారు.

బాలినేనికి అన్నీ తెలిసే సెకీ ఒప్పందంపై సంతకం: చెవిరెడ్డి

తిరుపతిరూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి అన్నీ తెలిసే సెకీ ఒప్పందంపై సంతకాలు చేశారని, ఇప్పుడు కూటమిపార్టీలో మెప్పుకోసం తనకి తెలియకుండా జరిగిందని బుకాయిస్తున్నారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. తుమ్మలగుంటలో సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ పంపితేనే తాను ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా వచ్చానని చెప్పారు. వైఎస్సార్ ఫ్యామిలీతో బాలినేనిది బంధుత్వమైతే తనది 36ఏళ్ల అనుబంధమని చెప్పారు. నమ్ముకున్న నాయకుడి కాళ్లు లాగితే తప్పు కానీ కాళ్లు పట్టుకుని ఎదిగితే తప్పేముందని ప్రశ్నించారు. తనకు బాలినేని అంటే ఎంతో గౌరవం ఉందని, సంతకాలు చేసి తనకి తెలియనట్లు అబద్ధాలు చెబుతూ తమ నాయకుడిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తట్టుకోలేకపోయానని అన్నారు.

హిందూ సంప్రదాయంలో మహిళలకు సముచిత స్థానం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని, కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయంలో మహిళలకు సముచిత స్థానం, గౌరవం ఉందని, స్త్రీ లేకపోతే ఈ సృష్టి లేదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రచార కార్యక్రమ పోస్టర్, అవగాహనా ర్యాలీని కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నాని మాట్లాడుతూ మహిళల రక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేస్తోందని, రాష్ట్రంలో త్వరలో కొత్త మహిళా కమిషన్ ఏర్పాటుకానుందని వివరించారు. మహిళలకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని కోరారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఎంపీడీవో రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆర్టీసీ బస్సుల ఢీ : 20 మందికి స్వల్ప గాయాలు



భాకరాపేట ఘాట్ రోడ్డులో ఢీకొన్న బస్సులు

చంద్రగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డులో సోమవారం సాయంత్రం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె నుంచి తిరుపతికి వస్తున్న బస్సు, తిరుపతి నుంచి పీలేరుకు వెళుతున్న బస్సు భాకరాపేట ఘాట్‌లో ఎదురుఎదురుగా ఢీ కొన్నాయి. 20 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నారావారిపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రానికి 108 అంబులెన్స్ వాహనంలో తీసుకొచ్చారు. ఈ ప్రమాదంతో సుమారు గంట వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదానికి గురైన బస్సులను పక్కకు తొలగించి వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని నారావారిపల్లికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వైద్య సేవల గురించి ఆరా తీశారు. ప్రమాదం జరిగిన తీరుపై ను చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

డబ్బంతా జీతాలకే సరిపోతే..అభివృద్ధి ఎలా?

- రసాభాసగా గాంధీపురం గ్రామసభ



సిబ్బంది వివరాలు అడుగుతున్న వార్డు సభ్యుడు

తిరుపతిరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీలో ఉండే సిబ్బంది తిరుపతి మున్సిపాలిటీలో కూడా లేరని, డబ్బంతా సిబ్బంది జీతాలకే సరిపోతే అభివృద్ధి పనులు ఎలా చేయాలని పలువురు వార్డు సభ్యులు పెదవి విరిచారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం సచివాలయంలో సోమవారం సర్పంచ్ ఎం.లక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ పంచాయతీకి ట్యాక్స్‌ల రూపంలో వచ్చే డబ్బంతా సిబ్బంది జీతాలకే సరిపోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని నిలదీశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి విజయనిర్మల మాట్లాడుతూ తాను రాకముందు నియమించినవారు ఉన్నారే తప్ప, కొత్తగా ఎవరినీ తీసుకోలేదని వివరించారు. అలాగే గతంలో చేసిన తీర్మానం మేరకు అటెండర్‌ను మాత్రమే తీసుకున్నామన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ తనకు సమాచారం లేకుండా కొందరు సిబ్బంది నియామకం జరిగిందని ఆరోపించారు. తుమ్మలగుంట డ్రైనేజీ నీరు గాంధీపురంలోకి రాకుండా చూడాలన్నారు. సీసీ రోడ్డును పగులగొట్టి యూడీసీ కనెక్షన్ చేపట్టిన వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సిబ్బంది జీతాలు, వీధి దీపాలు, ఫాగింగ్, గ్రావెల్ రోడ్లకి సంబంధించి తీర్మానం చేసినట్లు కార్యదర్శి వివరించారు. ఎంపీటీసీ జయకర్ పాల్గొన్నారు. కాగా వార్డు సభ్యుల్లో కొందరి తరఫున వారి బంధువులు హాజరై మాట్లాడడం కొసమెరుపు.

వైసీపీ నేతల అండతో కొండపై పెరిగిన అనధికారిక తట్టలు

● టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి



దుకాణదారులతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుమలలో హాకర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. ఎలాంటి లైసెన్సులు లేకపోయినా వైసీపీ నేతల అండదండలతో అనధికారిక తట్టలు పెరిగిపోయాయి' అని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి విమర్శించారు. తిరుమలలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆయన తనిఖీలు చేశారు. కొన్ని తట్టల లైసెన్సులను పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్, వరాహస్వామి కాంప్లెక్స్, వైకుంఠం, సప్తగిరి, అన్నదాన సత్రం, యాత్రికుల వసతి సముదాయం వంటి ప్రాంతాల్లో వందల కొద్దీ తట్టలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. దీంతో అప్పటి వైసీపీ నేతలకు కోట్లు ముట్టాయన్నారు. అఖిలాండం వద్ద, డీఎంబీ రోడ్డులో, వరాహస్వామి అతిథిగృహం వద్ద దాదాపు 13 నూతన తట్టలు ఏర్పాటు చేసినట్టు తెలిసిందన్నారు. గతంలో వైసీపీ నేతలు అక్రమంగా తట్టలు నిర్వహిస్తుండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసివేయించిందన్నారు. వాటిని ప్రస్తుతం కూటమి పార్టీల నాయకుల పేర్లు చెప్పుకొని మరి కొందరు మళ్లీ ప్రారంభిద్దామని ప్రయత్నిస్తున్నారనే ఫిర్యాదులు వచ్చిన క్రమంలో తనిఖీలు చేసినట్టు తెలిపారు. త్వరలో అనధికార తట్టలన్నీ తొలగిస్తామని పేర్కొన్నారు.

మా అబ్బాయి పెద్ద భక్తుడు: జయదేవ్



గల్లా జయదేవ్, అశోక్

తిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తన పెద్ద కుమారుడు, హీరో అశోక్ పెద్ద భక్తుడని, తనకూ దేవుడంటే చాలా ఇష్టమని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. సోమవారం ఉదయం తన కుమారుడితో కలిసి శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కొన్ని కారణాల వల్ల 'దేవకీ నందన వాసుదేవ' సినిమా కాస్త డౌన్ అయినట్టు కనిపించినప్పటికీ రోజురోజుకు మంచి స్పందన వస్తోందన్నారు. ఈ సినిమా కథ, నటన చాలా బాగుందని, తప్పకుండా ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరు చూడాలని కోరారు. హీరో గల్లా అశోక్ మాట్లాడుతూ.. సినిమా విడుదలకు ముందే తిరుమలకు వద్దామనుకున్నా కొన్ని కారణాలతో రాలేకపోయానన్నారు. ఇక, ప్రస్తుతం సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌లో ఓ సినిమాలో నటిస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు నిర్మాతలు బన్నీ వాసు, నవీన్ ఎర్నేని కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆరు నెలల కిందట మిస్సింగ్

● ఇప్పటికి బయటపడిన మృతదేహం

పాకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల కిందట తప్పిపోయారా వ్యక్తి. ఇప్పటికి ఆయన మృతదేహం బయటపడింది. వివరాలిలా ఉన్నాయి. పాకాల మండలం పంటపల్లె సమీపంలోని ఓ పొలంలో ఉన్న ఇటుక బట్టీల దగ్గర షెడ్డులో మే 4వ తేది రాత్రి ఎన్నికల కోసం అక్రమంగా తెప్పించిన మద్యం కేసులను ముగ్గురు వ్యక్తులు లారీ నుంచి దించుతున్నారు. ఆ సమయంలో పోలీసులు అక్కడికి రావడంతో ఇద్దరు వ్యక్తులు షెడ్డులోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. మరో వ్యక్తి ఉమర్ ఫరూఖ్ భయంతో పారిపోయాడు. చీకట్లో పారిపోతూ పందుల కోసం పొలంలో తీసిన కరెంటు తీగలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మరుసటి రోజు ఉదయం ఆ పొలం లీజుకు తీసుకున్న వ్యక్తి ఆ మృతదేహాన్ని గుర్తించి నేరం తనపై వస్తుందేమోనని గుట్టుచప్పుడు కాకుండా సమీపంలో పూడ్చివేసినట్లు చెబుతున్నారు. కాగా, స్థానిక పోలీసు స్టేషను సమీపంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్న ఉమర్ ఫరూఖ్.. ఆ రోజు నుంచి ఇంటికి రాకపోవడంతో భార్య తస్లీమా భాను, బంధువులు గాలించారు. ఆచూకీ తెలియక పోవడంతో మే 15వ తేదీన ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అప్పట్లోనే ఉమర్ ఫరూఖ్ చనిపోగా, పూడ్చివేశారంటూ సాగిన ప్రచారం.. ఆ నోటా ఈ నోటా పోలీసులకు తెలిసింది. సోమవారం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించడంతో మృతదేహం ఆనవాళ్లు లభించాయి. పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

మిద్దెపై నుంచి పడి రాజస్థాన్ వాసి మృతి



మృతి చెందిన మోహర్‌సింగ్

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మిద్దెపై నుంచి పడి రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మినగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన మోహర్ సింగ్ తిరుపతిలో వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అన్న రామ్‌కుమార్, ముఖేష్, పింటూలతో కలసి ధనలక్ష్మినగర్‌లోని ఒక ఇంటిలో మూడవ అంతస్తులో బాడుగకు ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి భోజనం అనంతరం మోహర్‌సింగ్ మిద్దెపై ఫోన్‌లో మాట్లాడుతూ కిందపడిపోయాడు. సోమవారం ఉదయం గమనించిన రామ్‌కుమార్, ముఖేష్‌లు అతన్ని తిరుపతి రుయాకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. సోదరుడు రామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

రామ్మూర్తి నాయుడికి నివాళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి పలువురు నివాళి అర్పించారు. ఎస్వీ యూనివర్సిటీ టైం స్కేల్ ఉద్యోగి ఆముదాల సుబ్రమణ్యం నాయుడు, టీటీడీ ఉద్యోగి వైకుంఠం మోహన్ తదితరులు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రామ్మూర్తి నాయుడు సేవలను గుర్తు చేసుకున్నారు.

నేడు చలో కలెక్టరేట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారానికి వెటర్నరీ యూనివర్సిటీలోని కార్మికులు చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను వెటర్నరీ వర్సిటీ సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘం నాయకులు చిన్నబాబు, సుమన్, నాగ వెంకటేష్ ఆవిష్కరించారు. చలో కలెక్టరేట్‌కు కార్మికులు తరలి రావాలని కోరారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద మంగళవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఎన్‌డీ రవి కోరారు. బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టనున్న ఈ కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు, కార్మికులు, ఒప్పంద కార్మికులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నేతలు గోవిందస్వామి, సురేష్, మహేంద్రబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీఏఎస్ దరఖాస్తుల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) స్క్రూట్నీ కమిటీ మంగళవారం నుంచి దరఖాస్తులను పరిశీలించనుంది. శుక్రవారం వరకూ ఈ ప్రక్రియ కొనసాగనుంది. రెండు నెలల క్రితం సీఏఎస్ నోటిఫికేషన్ వచ్చింది. గత నెల 26వ తేదీ నాటికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నారు.

ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి



తిరుపతి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఎల్ఎస్‌నగర్‌లోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో నాలుగో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పుష్ప, అన్నాభిషేకాలతో పాటు వివిధ రకాల స్వీట్లతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు చెంగారెడ్డి, ఉమాపతిరెడ్డి, మేనేజర్ లీలాప్రకాష్, అర్చకులు దివాకర్, ధర్మేంద్ర, వంశీ పాల్గొన్నారు.

రూ.3.91కోట్లతో సైడ్ డ్రయిన్ పనులు

● హౌస్‌హోల్డ్ 65శాతం, ఎన్‌పీసీఐ సర్వే 73శాతం పూర్తి ● ఆంధ్రజ్యోతితో రూరల్ ఎంపీడీవో రామచంద్ర



తిరుపతిరూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీలలో రూ.3.91కోట్లతో సైడ్ డ్రయిన్స్(సైడు కాలువల) పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.3,91,60,000వేలు మంజూరయ్యాయని, ఈ నిధులతో 13పంచాయతీల్లో 47 పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. మంగళం పంచాయతీలోని బీటీఆర్‌కాలనీలో తెగిపోయిన రోడ్డు నిర్మాణానికి రూ.20లక్షలతో అంచనా దశలో ఉందని తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధిలో భాగంగా మండలంలో 5చోట్ల కుట్టుమిషన్ శిక్షణ నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

● శరవేగంగా హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వేలు : మండలంలో సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వేలను శరవేగంగా నిర్వహిస్తున్నారు. హౌస్‌హోల్డ్‌కి సంబంధించి మండలంలో 56వేల ఇళ్లకుగాను 36వేల ఇళ్లకి జియో ట్యాగింగ్ పూర్తి అయ్యింది. 65శాతం పూర్తి చేసుకుని తిరుపతి రూరల్ మండలం 25వ స్థానంలో ఉంది. ఎన్‌పీసీఐ సర్వేకి సంబంధించి 73శాతం పూర్తిచేశారు. ఈ సర్వేలో రూరల్ మండలం 16వ స్థానంలో ఉంది.

● అపార్ కోసం ఆధార్ శిబిరాలు: జాతీయ నూతన విద్యావిధానం-2020లో భాగంగా భారత ప్రభుత్వం ఒకే దేశం-ఒకే విద్యార్థి గుర్తింపు కార్డు(అపార్) నమోదు ప్రక్రియను చేపట్టిన విషయం తెలిసిందే. మండలంలోని పలు పంచాయతీల్లో ఇప్పటికే రెండు దఫాలుగా ఆధార్‌సేవా శిబిరాలను నిర్వహించారు. 1,500మందికి ఆధార్‌సేవలను అందించాం. ప్రైవేట్ జూనియర్ కళాశాలలో మరోదఫా ఆధార్ సేవా శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నాం.

ముగ్గురు దొంగల అరెస్టు

ఆరు మోటారు సైకిళ్లు...రెండు ఆటోల సీజ్



పోలీసుల అదుపులో నిందితులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లు, ఆటోల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. మంగళం వెంకటేశ్వర కాలనీకి చెందిన ఎస్.పూర్ణ, చెంచులక్ష్మి కాలనీకి చెందిన మహేష్, అంబేడ్కర్ కాలనీకి చెందిన దిలీప్‌కుమార్‌లు జల్సాలకు అలవాటుపడి వీధులు, బహిరంగ ప్రదేశాల్లోని పార్కింగ్ ప్రదేశాల్లో ఉంచిన మోటారు సైకిళ్లు, ఆటోలు దొంగలించేవారు. తిరుపతి, చంద్రగిరి, ఎమ్మార్‌పల్లి, ఆర్టీసీ బస్టాండు, కుమ్మరితోపు తదితర ప్రాంతాల్లో ఆరు మోటారు సైకిళ్లు, రెండు బజాజ్ లగేజీ ఆటోలను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చింతలచేను రైల్వే గేటు వద్ద సోమవారం వారిని అరెస్టు చేసి, ఆరు మోటారు సైకిళ్లు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు.

టీచింగ్ అసిస్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయండి



వీసీకి విన్నవిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో టీచింగ్ అసిస్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని బీజేపీ నేత కల్లూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడును కలిసి సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. 2019లో వైసీపీ గెలిచిన వెంటనే 60 మంది టీడీపీ సానుభూతిపరులను తొలిగించిందని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పును కూడా పెడచెవిన పెట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా అర్హులైన నిరుద్యోగులకు టీచింగ్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. డిసెంబరు 15వ తేదీలోపు నోటిఫికేషన్ విడుదల చేసి, టీచింగ్ అసిస్టెంట్లను భర్తీ చేస్తామని వీసీ అప్పారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మహేంద్ర నాయక్, డాక్టర్ పోతగంటి చిరంజీవి, మధుకర్‌నాయక్, శంకర్, రాజు, లక్ష్మణ్, కేశవ్ పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్మగ్లర్ అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాజంపేట సెక్షన్ పరిధిలోని పింఛా డ్యాం వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఓ స్మగ్లర్‌ను అరెస్ట్ చేసి, ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్‌ఐ కృపానందకు చెందిన ఆర్‌ఎస్‌ఐ టి.రాఘవేంద్ర బృందం సోమవారం తెల్లవారుజామున కూంబింగ్ నిర్వహిస్తుండగా ఆరోగ్యపురం సమీపంలోని చెయ్యేరు వద్ద కొందరు అనుమానాస్పదంగా కనిపించడంతో చుట్టుముట్టేందుకు ప్రయత్నించారు. ఒకరిని పట్టుకోగలిగారు. అతను అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. సమీపంలో దాచి ఉంచిన ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి ఎస్‌ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు



సెమీఫైనల్స్‌కు చేరిన బాలికల జట్టు

తిరుపతి(క్రీడలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మంగళంలోని ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండు రోజులుగా జరిగిన లీగ్ పోటీల్లో 16 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. బాలుర విభాగంలో కృష్ణా జిల్లాపై విశాఖపట్నం జట్టు విజయం సాధించింది. శ్రీకాకుళంపై కడప గెలుపొందింది. బాలికల విభాగంలో అనంతపురంపై విజయనగరం విజయం సాధించింది. కర్నూలుపై చిత్తూరు గెలుపొందింది. మంగళవారం జరిగే సెమీఫైనల్స్‌లో విజేతలు తుది సమరంలో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

వీధి విక్రయదారులకు రుణాలు

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన వీధి విక్రయదారులకు ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు అందిస్తున్నామని యూనియన్ బ్యాంక్ కరకంబాడి బ్రాంచి మేనేజర్ సరిత అన్నారు. పీఎం స్వానిధి పథకంపై సోమవారం తిరుపతిలోని విక్రయదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. డిజిటల్ ట్రాన్సాక్షన్స్, ఇన్సూరెన్స్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎస్.కృష్ణవేణి, సీవో కావమ్మ పాల్గొన్నారు.

టాక్సీడ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



తిరుపతి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీసిద్ధి వినాయక టాక్సీడ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. సోమవారం విష్ణునివాసం ముందు జరిగిన సమావేశంలో అసోసియేషన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిల్లా హరినాథ్, ఉపాధ్యక్షుడిగా శెట్టి సురేష్‌కుమార్, కార్యదర్శిగా వి.రామరాజు, సభ్యులు నియమితులయ్యారు.

కాసింత నీడ కల్పించరూ..!

- పద్మావతి జూనియర్ కాలేజీ ముందు తల్లిదండ్రుల కష్టాలు
- విద్యార్థుల కోసం నేలపైనే కూర్చొని గంటల తరబడి ఎదురుచూపులు



విద్యార్థుల కోసం వేచి ఉన్న తల్లిదండ్రులు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లో పిల్లలను చూసి వెళ్లడానికి వందల సంఖ్యలో తల్లిదండ్రులు తిరుపతి పద్మావతి జూనియర్ కాలేజీ వద్దకు వస్తుంటారు. ప్రతి ఆదివారమూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకే తల్లిదండ్రులను అనుమతిస్తారు. పద్మావతి జూనియర్ కాలేజీలో సుమారు 1,600 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో సుమారు 900 మంది హాస్టల్‌లో వసతి పొందుతున్నారు. వారంతా దూర ప్రాంతాలకు చెందిన వారే. ఇందులోనూ బాలికల కళాశాల కావడంతో తరచూ తల్లిదండ్రులు చూసి వెళ్లడానికి వచ్చిపోతుంటారు. పైగా ఏదైనా పోటీ పరీక్షల కోసం కూడా వందలాది మంది అభ్యర్థులు కాలేజీ వద్దకు వస్తూపోతూ ఉంటారు. వారు కాలేజీ బయటే రోడ్డుపైన కూర్చోవాల్సి వస్తోంది. కనీసం ఒక షెడ్డు నిర్మించి, తాగునీటి సదుపాయం కల్పించడం మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో ధాత్రి సదన్ పేరుతో కాలేజీ లోపలి వైపున తల్లిదండ్రుల కోసం నిర్మించారు. ఇందులో కుర్చీలను సైతం ఒక అధ్యాపకురాలు వితరణ చేశారు. అయితే విజిటింగ్ వేళల్లోనే అందులోకి తల్లిదండ్రులను అనుమతిస్తారు. అప్పటి వరకు వారంతా వచ్చీపోయే దారిలో, గేటు ముందు, నేలపైనే కూర్చొని గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. వీరికోసం షెడ్డు నిర్మిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అసుంతను వివరణ కోరగా టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి

- అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం
- పీజీఆర్‌ఎస్‌కి 222 ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 222 అర్జీలు అందగా అందులో 135 రెవెన్యూ విభాగానికి వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

పింఛను కోసం రెండున్నరేళ్లుగా తిరుగుతున్నా..

- షణ్ముగం, ఆటోడ్రైవర్, తిరుచానూరు



ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడిని. మూడేళ్ల క్రితం పక్షవాతం కారణంగా కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. మంచానికే పరిమితమయ్యాను. కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛను ఇప్పించాలని రెండున్నర సంవత్సరాలుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా కనికరం చూపించడంలేదు.

పింఛను ఇప్పించండి మహాప్రభో..

- మన్నెం రాజా, శ్రీనివాసపురం పంచాయతీ, తిరుపతి రూరల్ మండలం



నేను, నా తల్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లం. సంవత్సరం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాను. నా తల్లికి వయసు మీరిపోయింది. మా జీవనం అగమ్యగోచరంగా మారింది. సంవత్సరంగా పింఛను కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. మీరైనా పట్టించుకోండి.

మా భూములు ఇప్పించండి

- కూచివాడపాళెం గ్రామస్తులు, నాయుడుపేట



అయ్యా మేమంతా దళితులం. మా గ్రామంలో 30 ఏళ్లగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. సాగు చేసుకుంటున్న భూమి ప్రభుత్వానిదని అధికారులు పనులను అడ్డుకున్నారు. జీవనాధారంగా ఉన్న ఆ భూమిని తిరిగి ఇప్పించండి.

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘ నాయకులు

బీసీ కులగణన వెంటనే చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజగౌడ్ నేతృత్వంలో బీసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ తక్షణమే బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు మాసుమయ్య, జగదీష్ ఆచారి, విజయ్, మధు పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 74 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి 74 వినతులు అందాయి. ఎస్పీ సుబ్బరాయుడు అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వినతుల్లో ఎక్కువగా భూ, కుటుంబ తగాదాలు, భార్యాభర్తల గొడవలు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వాటిపై విచారణ జరిపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు

- శాప్ చైర్మన్ రవి నాయుడు



తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయన్ను మానసిక వైద్యులకు చూపించాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన సోమవారం మాట్లాడుతూ విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో విద్యాదీవెన కింద రూ.3,200 బకాయిలు పెట్టాడని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించి రూ.2,456 కోట్లు బకాయిలు పెట్టారని పేర్కొన్నారు. విద్యార్థులకు రూ.6వేల కోట్లు అందకుండా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే నన్నారు. రెండు లక్షల మందికి పైగా విద్యార్థులకు సర్టిఫికెట్లు పొందలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించిందని తెలిపారు. వసతి దీవెన పేరుతో రూ.20వేలు ఇస్తామని కోతపెట్టింది జగన్ కాదా అని ప్రశ్నించారు. విద్యార్థులకు న్యాయం జరిగేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన మెప్మా పీడీ



తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా మెప్మా పీడీగా నియమితులైన డి.రవీంద్ర సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంబంధిత శాఖ అంశాలను కలెక్టర్‌కు వివరించారు.

పంట బీమా పథకం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌ను పురస్కరించుకుని పంటల బీమా పథకంపై జేసీ శుభం బన్సల్ సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటలకు రైతులు బీమా చేసుకోవాలని తెలిపారు. వేరుశనగకు డిసెంబరు 15, వరికి 31వ తేదీలోపు నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఇన్‌చార్జి ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, సహాయ వ్యవసాయ సంచాలకులు ధనంజయరెడ్డి, వ్యవసాయాధికారిణి సరళ, ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవన శైలిపై నేడు అవగాహన ర్యాలీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రకృతి ఆధారంగా మానవుని జీవన శైలి, ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వి.విజయకుమార్ తెలిపారు. తిరుపతి రామచంద్ర పుష్కరిణి నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని, నగరవాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం తిరుపతికి రానున్నారు. హైదరాబాద్ నుంచి సాయంత్రం 3.40 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి గ్రాండ్ రిడ్జ్ హోటల్‌కు చేరుకుని బస చేస్తారు. బుధవారం ఉదయం 7 గంటలకు తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం నారావారిపల్లికి చేరుకుని నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియల ఏర్పాట్లను పరిశీలిస్తారు. 28వతేదీ అంత్యక్రియల్లో పాల్గొంటారు.

కార్పొరేషన్ పీజీఆర్‌ఎస్‌కు 26 వినతులు

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి 26 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి తెలిపారు. అందులో ముఖ్యంగా టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, వీధుల్లో చెత్త తొలగించాలని, టిడ్కో ఇళ్లు ఇప్పించాలని, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలని కోరారని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ తమతమ డివిజన్లలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, ఆర్వోలు సేతుమాధవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

తిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని హెచ్‌టీ కాంప్లెక్స్ దుకాణ సముదాయాన్ని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సోమవారం తనిఖీ చేశారు. కొందరు దుకాణదారులు ఆక్రమణలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులతో అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా ఆక్రమణలకు పాల్పడిన వ్యాపారులపై ఆగ్రహించారు.

ఏఐ, రోబోటిక్స్‌లో అవకాశాలు పుష్కలం



విద్యార్థులకు రోబోటిక్స్, ఏఐ గురించి వివరిస్తున్న గెస్ట్ లెక్చరర్ చరణ్

తిరుపతి(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్‌లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఐడబ్ల్యూఐజడ్ ఆండ్రాయిడ్ రోబో, రోబోటిక్స్ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రీజనల్ మేనేజర్ వి.చరణ్ అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌పై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం తిరుపతిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ వీసీ హాల్లో సోమవారం నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇండస్ట్రీ ఎంటర్ కనెక్ట్ శాఖల విద్యార్థులకు ఏఐ, రోబోటిక్స్ రంగాల గురించి, ఆయా రంగాల్లో ఉన్న అవకాశాల గురించి, ఎదురయ్యే సవాళ్ల గురించి చరణ్ వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ గౌరీశంకర్, శైలజ, ఉదయ్‌కుమార్, అధ్యాపకులు లవకుమార్, లక్ష్మీశిల్ప పాల్గొన్నారు.

ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.1,00,116 విరాళం

తిరుపతి(వైద్యం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించే శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరుకు చెందిన నాగదీపక్ రూ.1,00,116 విరాళంగా అందించినట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీడీ రూపంలో నాగదీపక్ స్నేహితుడు రాఘవేంద్ర డైరెక్టర్ కార్యాలయంలో అందజేసినట్లు వివరించారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు, ప్రభుత్వ కాలేజీల్లో పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ కోటాలో భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉన్నత విద్యాశాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. సెట్‌లో అర్హత సాధించనివారు, పీజీసెట్‌కు హాజరుకానివారికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించవచ్చని ఉన్నత విద్యామండలికి స్పష్టంచేశారు. ఈ కోటాలో అడ్మిషన్లు పొందేవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదన్నారు.

7న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశాన్ని డిసెంబరు 7న నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని 45వేల పాఠశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించాలన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.పాఠశాలల్లో బోధన మెరుగుపరచడం, వసతుల అభివృద్ధి లక్ష్యాలతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

శివపార్వతులకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న రాస్ నిర్వాహకులు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొమ్మగుంట పద్మావతి ప్రార్థనా మహిళా మండలి ప్రాంగణంలో సోమవారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ఆధ్వర్యంలో కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. శివపార్వతులకు సామూహిక కల్యాణాలు, ప్రత్యేక పూజలు చేశారు. డీఎస్పీ శ్రీలత, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ ఈ మాసంలో మహిళలు పూజలు చేయడం వల్ల భక్తిభావం పెరుగుతుందన్నారు. వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లు, బియ్యం, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు.

nేషనల్ ఛాంపియన్‌షిప్‌కు

వెళ్లబోతున్నా

ఇండియన్ షూటర్ ఎలవెనిల్ వలరివన్



తిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 2018 జూనియర్ ప్రపంచకప్‌లో భారత్‌కు బంగారు పతకాన్ని సాధించిన ఇండియన్ క్రీడా షూటర్ ఎలవెనిల్ వలరివన్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎలవెనిల్ వలరివన్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. చాలా రోజుల తర్వాత స్వామి దర్శనం లభించిందని, మంచి అనుభూతి కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో భోపాల్‌లో జరిగే నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లబోయే ముందు స్వామి ఆశీస్సుల కోసం తిరుమల వచ్చినట్లు తెలిపారు.



నేత్రపర్వం.. కోటి దీపోత్సవం

తిరుపతి ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రామచంద్ర పుష్కరిణి ప్రాంగణంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసంలో 365 వత్తులతో దీపం వెలిగించడం ద్వారా ఏడాది పొడవునా దీపం వెలిగించకపోయినా ఆ అపరాధ భావన పోతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఫిల్మ్ సొసైటీ చైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి శేషగిరిరావు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, స్విమ్స్ డైరెక్టర్ రవి కుమార్, పారిశ్రామికవేత్త పీసీ రాయల్, ఫిల్మ్ సొసైటీకి చెందిన ప్రసాదరావు, బుజ్జిబాబునాయుడు, బండి మధుసూదనరెడ్డి, గుల్జార్, అనసూయ, మేరీజాయ్, శాంతావాణి, భాస్కర్, శమంతకమణి, భక్తులు పాల్గొన్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

కార్తీక వెలుగుల్లో కపిలతీర్థం

కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా తిరుపతిలోని కపిలతీర్థంలో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ మహిళలు పిండి తలిగ వేసి నేతి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పుష్కరిణికి నాలుగు వైపులా ఉన్న మండపాలలో దీపాలను వెలిగించారు. జలపాతం కింద భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం కామాక్షి కపిలేశ్వరులను, పరిదేవతలైన వల్లీయమ్మ, సుబ్రమణ్యస్వామి, గురుదక్షిణామూర్తి, నాగలింగ కూటమిని దర్శించుకున్నారు.

శ్రీకాళహస్తిలో

కార్తీకం రద్దీ



నాలుగో కార్తీక సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వర్ణముఖి నదిలో స్నానాలు ఆచరించి రెండోగేటు సమీపంలో భక్తులు దీపారాధన సమర్పించారు. సుమారు 37వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.50శీఘ్ర దర్శనం టిక్కెట్లు గరిష్ఠ స్థాయిలో 5,725, రూ.200 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,822 కలిపి మొత్తం 9,547 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక ఐదు రకాల రాహుకేతుపూజలు కలిపి 4,169 జరిగాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



కాలుష్యం కోరల్లో విలవిల



'నిబంధనలు పాటించని పరిశ్రమల నుంచి నిరంతరం వెదజల్లుతున్న రసాయనాల వల్ల ఊపిరి తీసుకోలేకపోతున్నాం. గుండెజబ్బుల బారినపడుతున్నాం.. కళ్లు మంటలతో అల్లాడుతున్నాం. కాపాడండి సారూ' అంటూ రేణిగుంట మండల పరిధిలోని పారిశ్రామికవాడ పల్లెల ప్రజలు వేడుకుంటున్నారు. పీల్చే గాలి, తాగేనీరు కలుషితం కావడంతో ఎప్పుడు ఏ రోగం వస్తుందో తెలియక బతుకు జీవనం సాగిస్తున్నారు.

- పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న రసాయనాలు
- రోగాల బారిన పరీవాహక గ్రామాల ప్రజలు
- ఊపిరి తీసుకోలేక పోతున్నాం..కాపాడండి అంటూ వేడుకోలు



రసాయనాలు వెదజల్లుతున్న మైథిలి కర్మాగారం

కథనం రేణిగుంట,ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండలంలోని గాజులమండ్యం, ఎర్రంరెడ్డిపాళెం, రేణిగుంటలో మూడు పారిశ్రామిక వాడలున్నాయి. అప్పటి జనసంఖ్య ఆధారంగా ఈ ప్రాంతాలను పారిశ్రామికవాడలుగా గుర్తించి ప్రభుత్వం కేటాయించింది. నేడు వాటికి చుట్టుపక్కల జనాభా పెరగడంతో ఊర్లు, గ్రామాలు విస్తరించాయి. అదే తరుణంలో పారిశ్రామికవాడల్లో కాలుష్యం పెరిగింది. పరి శ్రమల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను యథేచ్ఛగా బయటకు వదిలేస్తున్నారు. ఈ విషయమై నల్లపాళెం, నీలసానిపేట, అత్తూరు, దేశమ్మనగర్, గాజులమండ్యం, ఎర్రంరెడ్డిపాళెం, వినాయకపురం గ్రామాల ప్రజలు అనేక పర్యాయాలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులు చేశారు. చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించి తర్వాత గాలికొదిలేస్తున్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పారిశ్రామికవాడల్లో ప్రమాదాలు నెలకొన్న సమయాల్లో మాత్రం హడావుడి చేసి, నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపేదిశగా చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

మురుగు కాలువలు లేక..

తిరుపతి-రేణిగుంట మార్గంలోని పారిశ్రామికవాడలో రోడ్లు, మురుగు కాలువలు లేవు. కర్మాగారాల్లో ఉపయోగించే నీటిని బయటకు వదిలేస్తున్నారు. దీంతో కింద ఉన్న ఎర్రంరెడ్డిపాలెం, వినాయకపురం గ్రామాల్లో నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ చూసినా ప్లాస్టిక్, చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్‌ను వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, ఈ ప్రాంతాల్లో పర్యటించి నోటీసులు జారీ చేస్తామని అన్నారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ కారిడార్ జోనల్ మేనేజరు చంద్రశేఖర్‌ను వివరణ కోరగా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి స్థానిక పరిశ్రమల నుంచి సగం వాటా పెట్టుకుంటే పై అధికారుల దృష్టికి తీసుకుపోయి స్థానిక సమస్యలను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తమకు వచ్చే పన్నులకు కేవలం పారిశ్రామికవాడలో లైట్లు, ఇతర చిన్న సమస్యలను పరిష్కరించగలమని స్పష్టం చేశారు.



రోడ్డు పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



ఎర్రంరెడ్డిపాళెం పారిశ్రామికవాడలో రోడ్ల దుస్థితి

ఊపిరి తీసుకోలేకపోతున్నాం



మా గ్రామంలో 550 మంది నివసిస్తున్నారు. కర్మాగారాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అందుకే 2019లో ఎన్నికలను కూడా బహిష్కరించాం. దీంతో అప్పటి ఎన్నికల అధికారి, తహసీల్దారు ప్రాధేయపడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. నేటికీ సమస్య అలాగే ఉంది. గ్రామంలో అత్యధింగా గుండెపోటుకు గురవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబరులో ఇద్దరు మృతి చెందారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పరిశ్రమ నుంచి వెదజల్లే రసాయన వాయువు వల్ల రాత్రి ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉంది.

- మోహన్‌రెడ్డి, నల్లపాళెం గ్రామస్తుడు

నోటీసులిచ్చినా పట్టించుకోవడం లేదు



గాజులమండ్యం పారిశ్రామికవాడలోని పలు ఫార్మా కర్మాగారాల నుంచి వచ్చే వాయువుల వల్ల పరిసర గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, కళ్లమంటలకు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పలుసార్లు నోటీసులు ఇచ్చినా కర్మాగారాల యాజమాన్యాలు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మా గ్రామాల్లో సమస్యలను గుర్తించి, పరిష్కరించాలి.

- కరుణాకరరెడ్డి, అత్తూరు గ్రామస్తుడు

ప్రతి పాఠశాలలో

మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'బడివైపు ఒక అడుగు- తల్లిదండ్రులతో ముచ్చట్లు' కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలోనూ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనరు మౌర్య, డీఈవో కేవీఎన్ కుమార్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి వారి పిల్లల అసెస్మెంట్ కార్డులను అందించాలన్నారు. పేరెంట్ మీటింగ్ రోజున డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందించే మెనూ ప్రకారం ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ కలిసి భోజనం చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యా విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, తాగునీరు, పారిశుధ్యం, పిల్లల రక్తహీనత, వారి ఆరోగ్య సమస్యలు తదితరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై సమీక్షించి పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' పై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవోలు కూడా ఈ మీటింగులో పాల్గొనాలని, సచివాలయ సిబ్బందీ భాగస్వామ్యం చేయాలన్నారు. పూర్వ విద్యార్థులనూ ఆహ్వానించాలన్నారు.

సమీక్షలు .. సమావేశాలు



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ఉచిత ఇసుక విధానంలో అక్రమాలకు తావివ్వొద్దు

అక్రమాలకు తావు లేకుండా నూతన ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్లో పలు అంశాలపై సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జియో ట్యాగింగ్ చేయడంపై సమీక్షిస్తూ ఏర్పేడు, వెంకటగిరి, కేవీబీపురం మండలాల్లో తక్కువ పురోగతి ఉందని, పుత్తూరు మునిసిపాలిటీ పనితీరు బాగుందన్నారు. ఈ నెల 30 నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పాట్‌హోల్స్ ఫ్రీ రహదారుల కాన్సెప్ట్ కింద ఆర్అండ్‌బీ కింద 66 పనులు మొదటి విడతగా చేపట్టినవి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ట్యూషన్ ఫీజు కోసం ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

పీఏకే రంగారావును సన్మానిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు



వెండి తెరపై రాముడు, కృష్ణుడు.. ఎన్టీఆరే

సినీ గేయ వజ్రోత్సవ సభలో వీఏకే రంగారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెండి తెరపై కృష్ణుడు, శివుడు, రాముడిగా ఎన్టీఆర్ తన నటనా ప్రావీణ్యంతో దర్శనమిచ్చారని ప్రముఖ సినీ, సంగీత, నాట్య, కళా విమర్శకుడు వీఏకే రంగారావు పేర్కొన్నారు. అనంతపురానికి చెందిన మహాబోధి సాహిత్య వేదిక ఆధ్వర్యాన ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాలులో సోమవారం జరిగిన ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినిమాల్లో ఎన్టీఆర్ పోషించిన వివిధ పాత్రల గురించి ఆయన ప్రస్తావించారు. సినీ కళారంగం పట్ల అంకిత భావం ఉండటం వల్ల ఒక పాత్రను పరిపూర్ణంగా పోషించగలిగారన్నారు. పౌరాణిక పాత్రల్లో ఆయన ఎంత సజీవంగా నటించారంటే.. వెండి తెరపై సాక్షాత్తు ఆ దేవతామూర్తులను చూసినంత అనుభూతిని ప్రేక్షకులు పొందారని చెప్పారు. తనకు తెలియని విషయాలను తెలుసుకోవడానికి ఎలాంటి సంశయం చూపేవారు కాదన్నారు. సినిమా రంగానికి సంబంధించి తన అభిప్రాయాన్ని ఎన్టీఆర్ ఎదుటే చెప్పినా, సహృదయంతో విమర్శను స్వీకరించారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమా పాటలను గుర్తు చేసుకోవడమంటే, తెలుగు జాతి తన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రనూ జ్ఞాపకం చేసుకున్నట్టు అవుతుందన్నారు. ప్రజలను చైతన్యం చేసే అంశాలు ఎన్టీఆర్ సినిమాల్లో అధికంగా ఉన్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు కొనియాడారు. నేటికీ ఎందరో కళాకారులు, రాజకీయ నాయకులకు ఎన్టీఆర్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు చెప్పారు. భాష, భావం, అభినయంలో ఎన్టీఆర్‌ను మరో పాత్రతో పోల్చలేమని రిటైర్డు ప్రొఫెసర్ జేవీ సత్యవాణి అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ సినీ రంగ ఔన్నత్యాన్ని ఈ తరానికి తెలియ చేయడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని మహాబోధి సాహిత్య వేదిక ప్రతినిధి ఆచార్య జి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, రిటైర్డు ప్రొఫెసర్లు కోసూరి దామోదర నాయుడు, కె.మునిరత్నం, ఎన్.మునిరత్నమ్మ, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఇసుక డంప్‌ల సీజ్



రిలయన్స్ పెట్రోల్‌బంకు వెనుక ఇసుక డంప్

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. శ్రీకాళహస్తి శివార్లలోని చెన్నై రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక వైపు, తంగేళ్లపాళెం వద్ద మూతపడిన ఓ స్టోన్ క్రషర్ ప్రాంగణంలో ఇసుక డంప్‌లున్నట్లు అధికారులు సమాచారం అందుకున్నారు. ఆదివారం రాత్రి తహసీల్దారు మధుసూదన రావు ఆదేశాలతో సీనియర్ అసిస్టెంట్ నారాయణ, వీఆర్వో దినేష్ రెండు డంప్‌లను సీజ్ చేశారు. అలాగే తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ప్రాంతంలో ఇసుకను నిల్వ చేసి అక్కడి నుంచి తరలించినట్లుగా ఆనవాళ్లను గుర్తించారు. అయితే రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసి దీని వెనుక మూలసూత్రధారులను బహిర్గతం చేయకపోవడంపై రెవెన్యూ అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘాట్‌లో ఎలుగుబంట్ల కలకలం

తిరుమల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో సోమవారం ఎలుగుబంట్ల సంచారం కలకలం రేగింది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డులో ఏనుగుల ఆర్చ్ దాటాక రెండు ఎలుగుబంట్లు రోడ్డు దాటి కాలినడకమార్గం వైపు వెళ్లడాన్ని కొందరు వాహనదారులు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులకు అందజేశారు. ఈక్రమంలో అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అప్పటికే ఎలుగుబంట్లు వెళ్లిపోయినట్టు నిర్ధారించుకున్నారు. అయినప్పటికీ వాహనదారులను, నడకమార్గంలో వచ్చే భక్తులను అప్రమత్తం చేసి పంపుతున్నారు.

పుత్తూరు వార్తలు

చెడు వ్యసనాల జోలికి వెళ్లొద్దు



అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీఎస్పీ రవికుమార్

పుత్తూరు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ కె.రవికుమార్ సూచించారు. పట్టణంలోని వేదవ్యాస జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు రకాల నేరాలు, నియంత్రణ చర్యలపై పుత్తూరు పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చెడు సులభంగా అలవడి ముప్పుగా పరిణమిస్తుందన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తల్లి దండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని కోరారు. డ్రగ్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైం, సోషల్ మీడియా క్రైం, ఆన్‌లైన్ గేమ్స్‌పై అవగాహన కలిగించారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటు అందించారు. ఈ సమావేశంలో సీఐ సురేంద్రనాయుడు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

● తహసీల్దార్‌కు ఇప్పగుంటవాసుల వినతి

పుత్తూరు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేబీఆర్ పురం పంచాయతీ పరిధిలో దిగువ ఇప్పగుంటలో ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కొందరు టీడీపీ కార్యకర్తలు దిగువ ఇప్పగుంటలో ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని తహసీల్దార్ చెప్పారు.

రామ్మూర్తినాయుడికి నివాళులు



నివాళులర్పిస్తున్న విజయబాబు తదితరులు

పుత్తూరు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అన్నకు తగ్గ తమ్ముడిగా రామ్మూర్తి నాయుడు ప్రజా సేవకు అంకితమయ్యారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం నారావారిపల్లెలో రామ్మూర్తి నాయుడు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయుడు చేసిన సేవలను స్మరించుకున్నారు. తనయులు గిరీష్, రోహిత్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి రవినాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ధనపాల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండురంగయ్య, సతీష్‌నాయుడు, దాసరి విజయ్ చౌదరి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు



వడమాలపేటలో విశేష అలంకరణలో మహాశివుడు

వడమాలపేట, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయల్లో కార్తీక మాసం నాల్గో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ శంకర ఆలయంలో వేకువజామున మహాలింగానికి పంచామృతాభిషేకం, మహా లింగార్చన నిర్వహించారు. సదాశివకోనలో భక్తులు జాలువారే జలపాతం కార్తీక స్నానాలు చేసి తడిబట్టలతో సదాశివుడిని దర్శించుకున్నారు. అప్పలాయగుంట చంద్రమౌళీశ్వర స్వామి, ఓటీఆర్ కండ్రిగ వద్ద ఉమామహేశ్వర స్వామి, వడమాలపేటలోని గౌరీ శంకర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల వద్ద మహిళలు నేతి దీపాలు వెలిగించి దీప దర్శనం చేసుకున్నారు. తులసి, నెల్లి చెట్లుకు పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఓటీఆర్ కండ్రిగ లో తడుకు హైస్కూల్ 1981 బ్యాచ్ చెందిన వారు కార్తీక వనభోజనాలు నిర్వహించారు.

రాస్ ఆధ్వర్యంలో సామూహిక కార్తీక పూజలు



పుత్తూరు టౌన్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని ఆరేటమ్మ కాలనీలోని రామలింగేశ్వరాలయంలో రాస్ ఆధ్వర్యంలో మహిళా భక్తులు సామూహిక కార్తీక మాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు దీపారాధన చేసి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాస్ అధికారులు రవి, ప్రకాష్, కమలమ్మ, జయలక్ష్మి, భారతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటివైద్య శిబిరం

పుత్తూరు టౌన్, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపురం సమీపంలో ఉన్న బలరాం వైద్యశాలలో రాస్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం జరగనుంది. శంకర నేత్రాలయ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నారు.

పాప్ స్మియర్ పరీక్షతో గర్భాశయ క్యాన్సర్ గుర్తింపు

సత్యవేడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాప్ స్మియర్ వైద్య పరీక్షతో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌ను గుర్తించవచ్చని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్ తెలిపారు. సత్యవేడు 1వ సచివాలయం, శిరుణంబూదూరు గ్రామాల్లో స్విమ్స్ అంకాలజీ ఆధ్వర్యంలో పింక్ బస్సు ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ వైద్యులు చైతన్య భాను, పద్మావతి తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు, కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్‌లు మంజుల, జానకి, సెక్రటరీలు మునిరవికుమార్, సునీల్ కుమార్ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాల సమయం పెంపు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పని వేళలను ప్రభుత్వం గంట పెంచింది. సోమవారం ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు జరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్ట్ కింద ఉన్నత పాఠశాలను మోడల్‌గా ఎంపిక చేశారు. భవిష్యత్తులో మరికొన్ని పాఠశాలల్లో సమయం పెంచుతామని ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. కాగా గంట సమయం పెంపుపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మానసికస్థితి సరిగాలేకే యువకుడి ఆత్మహత్య

రేణిగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగా లేకనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి బయలుదేరిన పల్లెవెలుగు బస్సులో యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయమై కేసు నమోదు చేసిన దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా యువకుడి ఫోటోలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లకు పంపించిన విషయం విదితమే. ఎట్టకేలకు యువకుడు అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం పొడుగురాళ్లకు చెందిన శ్రీనివాసులుగా గుర్తించారు. మానసిక పరిస్థితి సరిగాలేని శ్రీనివాసులు ఇంటర్మీడియట్ చదువుతూ మధ్యలోనే నిలిపివేసి పెయింటింగ్ పనికి వెళ్తూ నాలుగు రోజులకోసారి ఇంటికి వచ్చేవాడని పోలీసులు విచారణలో కుటుంబీకులు తెలిపారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన శ్రీనవాసులు బస్సులో ఉరివేసుకున్నట్టు విచారణలో తేలిందన్నారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో శవపరీక్ష అనంతరం యువకుడి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ గిరి తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

భవనం నుంచి పడి కూలీ మృతి

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కూలీ పోలు దయాల్(47) మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. బంధువుల కథనం మేరకు... మండల పరిధిలోని తేవలతేరికట్టకు చెందిన దయాల్ సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ లే అవుట్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనికి వెళ్లాడు. సెంట్రింగ్ రేకులు తీస్తూ కిందకు వేసే సమయంలో అదుపు తప్పి మూడంతస్తుల భవనంపై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

పిల్లర్లకే పరిమితమైన పంచాయతీ భవనం



పిల్లర్లతో ఆగిపోయిన పంచాయతీ భవన నిర్మాణం

తడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ భవనం పిల్లర్లస్థాయిలోనే నిలిచిపోయింది. మండల పరిధిలోని వాటంబేడు పంచాయతీకి పరిపాలన భవనంలేదు. 2017లో అప్పటి ప్రభుత్వం పంచాయతీ నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు. సుమారు 5లక్షల రూపాయల వ్యయం ఖర్చుచేసి పిల్లర్లస్థాయి వరకు ఆ భవన నిర్మాణం చేశారు. ఆ తరువాత 2019 ఎన్నికల హడావుడి మొదలుకావడంతో నిధుల విడుదల ఆలస్యమైంది. ఆ తరువాత ప్రభుత్వం మారిపోవడంతో నిర్మాణంలో ఉన్న ఆ పంచాయతీ భవనం అలాగే దిష్టిబొమ్మలా నిలబడిపోయింది. గత ప్రభుత్వంలో సచివాలయాలను ఏర్పాటు చేశారు. సుమారు 45 లక్షల రూపాయలను ఒక్కొక్క సచివాలయ భవన నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. వాటంబేడు సచివాలయ భవన నిర్మాణానికి వచ్చేసరికి అప్పటికే పిల్లర్లస్థాయి నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ పంచాయతీ భవనాన్ని వదిలేసి మరో ప్రదేశంలో సచివాలయ నిర్మాణం చేపట్టారు. దీంతో పిల్లర్లస్థాయిలో ఈ భవనం దిష్టిబొమ్మలా మారిపోయింది. ఇలా ప్రజాధనం వృధా అయ్యింది.





నాయుడుపేట వద్ద స్వర్ణముఖినది, గూడూరులోని శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక పూజలు

నాయుడుపేట టౌన్, వెంకటగిరి టౌన్, డక్కిలి, గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు ఆలయంలో, స్వర్ణముఖినదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని జంబుకేశ్వర స్వామి ఆలయాలలో కార్తీక పూజలు నిర్వహించారు. ● వెంకటగిరి పట్టణంలోని కాశీ విశ్వనాథ స్వామి, రామలింగేశ్వర స్వామి, కర్ణకమ్మ వీధిలోని హర హరక్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద మల్లిఖార్జున భ్రమరాంబిక ఆలయాల్లో కార్తీక మాసం నాల్గవ సోమవారాన్ని పురష్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. ● డక్కిలి మండలంలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం వేకువజాము నుంచే మహిళలు ఆలయానికి చేరుకొని దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయంలో భక్తులకు అన్నదానం, తీర్థప్రసాలు అందజేశారు. ● కార్తీక మాసం నాలుగోవ సోమవారం సందర్భంగా గూడూరు పట్టణంలోని శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజోత్సవంలో అయ్యప్ప భక్తులు

నాయుడుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువానిగుంట గిరిజనకాలనీలో సోమవారం రాత్రి అయ్యప్ప పడిపూజోత్సవం నిర్వహించారు. శబరిమలై తరహాలో అరటి బొద్దులతో అయ్యప్పస్వామి గుడిని రూపొందించి పూజలు చేశారు. అయ్యప్ప భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోండి

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సోమవారం సీపీఐ పట్టణ కార్యదర్శి ఆనంద్ సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడుకు వినతిపత్రం అందజేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారని, ఈ వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మద్యం దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాయుడుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉషసిరి అన్నారు. పట్టణంలోని మద్యం దుకాణాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. దుకాణ యజమానులకు సూచనలు చేశారు. అలాగే పెళ్లకూరు మండలం చావాలి గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 12మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ బాలకృష్ణ, నాయుడుపేట ఎక్సైజ్ సీఐ అరుణకుమారి, ఎస్‌ఐలు గంగాధర్, రఫీ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

తడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. తడ మండలంలోని రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భీములవారిపాలెంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల గురించి వివరించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జయశ్రీదేవి, నాగేంద్రకుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి పితృవియోగం

పెళ్లకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్దనరెడ్డి(78) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వివిధ పార్టీల నాయకులు శిరసనంబేడులోని మురళీకృష్ణారెడ్డి స్వగృహానికి చేరుకుని జనార్ధనరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పేరం రమేష్‌నాయుడు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్, శిరసనంబేడు సర్పంచు గుంటపూడి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి తపాలాశాఖ కార్యాలయంలో

ఎన్‌పీసీఐ లింక్‌కు ప్రత్యేక శిబిరాలు

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిసబ్ డివిజన్ పరిధిలోని ప్రతి తపాలాశాఖ పరిధిలో ఎన్‌పీసీఐ అనుసంధానానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు, రాయితీకి సంబంధించిన నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ అయ్యేందుకు ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి అన్నారు. ఈ లింకు కోసం ఆధార్, మొబైల్‌ఫోన్ తీసుకువచ్చి కేవలం రూ.200తో పోస్టాఫీసులో ఐపీపీబీ ఖాతా ప్రారంభించాలన్నారు. పట్టణంలోని అన్ని పోస్టాఫీసుల్లో ప్రత్యేక శిబిరాలు అందుబాటులో ఉనానయన్నారు. ఈ ఖాతాలు తెరవడానికి 18-65 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

వాకాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమూరు గ్రామంలోని కండ్రిగ ఆక్వా గుంటల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులో ఉన్న రాగి వైరు, ఆయిల్, కాయల్స్‌ను ఎత్తుకెళ్లారు.

హెచ్‌ఐవీ, క్షయ నిర్మూలనపై అవగాహన

నాయుడుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన హెచ్‌ఐవీ, క్షయ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ ఆర్గనైజింగ్ సంస్థ మేనేజింగ్ బాలాజీరాజు అన్నారు. నాయుడుపేట నారాయణ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బేరిపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఏవో గౌస్, డీన్ బాలగురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆడపిల్లలను కాపాడుకుందాం'

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అవగాహన కల్పించి ఆడపిల్లలను కాపాడుకుందామని తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, ఏపీఎం అనీలా అన్నారు. కోటలో సోమవారం మహిళా హింస నిర్మూలన దినం నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు పొదుపు మహిళలు, వీవోఏలు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన లేని కారణంగా ఎంతో మంది మహిళలు బలైపోతున్నారన్నారు. గృహహింస, మహిళల వేధింపులు, అత్యాచారాలు, అత్యాచారయత్నాలు, తదితర వాటికి సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు శ్రీకాంత్, భాస్కర్, శంకరయ్య, ప్రసాద్, అలివేలమ్మ, బిందు, తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడికి నివాళి



రామ్మూర్తినాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తమ్ముడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడికి కోటకు చెందిన పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. సోమవారం చంద్రగిరి మండలం నారావారిపల్లిలో నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టీడీపీ జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు.

కోటలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో వేణు తెలిపారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం మంజూరు చేసిన భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ సేవకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మండలంలోని పోటు పాళెం గ్రామంలో గ్రామసేవకులకు కేటాయించిన భూముల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామసేవకుల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ గతంలో పోటుపాళెం గ్రామంలో ప్రభుత్వం 20మంది గ్రామ సేవకులకు 13 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. గ్రామానికి చెందిన కొందరు తమ భూములను ఆక్రమించుకున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతు న్నారన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంజీవయ్య బాబు, రాజయ్య, సుబ్రహ్మణ్యం, రఘు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరుకు చెందిన నూర్జహాన్ దివ్యాంగుడు. రెండుకాళ్లు పూర్తిగా చచ్చుపడిపోయినా ఆత్మవిశ్వాసంతో మిమిక్రీలో ప్రావీణ్యం సాధించాడు. సోమవారం రాత్రి నాయుడుపేట గాంధీ మందిరం సెంటర్‌లో తన అద్భుతమైన ప్రదర్శనతో అందరి మన్ననలు పొందాడు. - నాయుడుపేట

రౌడీయిజాన్ని ఉపేక్షించవద్దు: పాశిం

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ఎవరైనా రౌడీయిజానికి పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించవద్దని, వారిపై కఠిన చేపట్టి శాంతిభద్రతలు నెలకొల్పేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, హుస్సేన్‌బాషా, ఎస్‌ఐలు మనోజ్‌కుమార్, సురేష్‌బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పట్టణాధ్యక్షుడు శేఖర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

తడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వైసీపీ పట్టణాధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డిపై ఆ పార్టీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసింది. శేఖర్‌రెడ్డి వైసీపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, అంతే కాకుండా టీడీపీ నేతలతో సఖ్యతగా ఉంటున్నారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో రెండు వారాల కిత్రం శేఖర్‌రెడ్డికి వైసీపీ అధిష్టానం షోకాజ్ నోటీసు ఇచ్చింది. ఆయన ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేని కారణంగా శేఖర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 15మందికి వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.17.11 లక్షల చెక్కులను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పేదలు వైద్య ఖర్చులకు ఇబ్బంది పడకుండా సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఆర్థికంగా చేయూతనిస్తున్నామన్నారు. తాను పేద, మధ్యతరగతి ప్రజల అండదండలతోనే ఎమ్మెల్యే అయ్యానని, వారికి ఏ కష్టం వచ్చినా తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించగా సీఎం స్పందించి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించారని, త్వరలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, అంచనాల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ నియమితులవడంతో ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, తక్కెళ్లపాటి చంద్రమౌళి, నాగరాజు, వాటంబేడు శివకుమార్, జలీల్‌అహ్మద్, జహంగీర్, నంబూరు వెంకటేశ్వర్లు నాయుడు, జలీల్‌అహ్మద్, దుద్దా రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణానికి చెందిన విద్యార్థి తరుణీష్ జత్యా ఇటీవల గుజరాత్‌లో జరిగిన అండర్-17 ఆర్చరీ పోటీల్లో ప్రతిభచాటడంతో ఆ విద్యార్థినిని ఎమ్మెల్యే అభినందించారు. అలాగే చెన్నూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు వీరయ్యకు ట్రైసైకిల్ అందజేశారు.

జాతీయ యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రసంశాపత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం అన్నామణి

నాయుడుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగా పోటీల్లో ఎల్‌ఏ సాగరం విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు ప్రధానోపాధ్యాయురాలు అన్నామణి తెలిపారు. తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ యోగా పోటీల్లో ఎల్‌ఏ సాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని పవిత్ర విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. టీఎన్‌ఎస్‌వైసీ వారిచే షీల్డ్, ప్రసంశాపత్రాలను పొందారన్నారు. అలాగే 9వ తరగతి విద్యార్థులు షరీఫ్, ఖలీల్ కామన్ లీగల్ విభాగంలో ప్రతిభచూపి షీల్డ్‌ను సాధించినట్లు తెలిపారు. సోమవారం ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పద్మజ, ఉపాధ్యాయులు జి. వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై పోలీసులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో ఏపీపీ ప్రకృతికుమార్, డీఎస్పీ చెంచుబాబు

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అరెస్టు, రిమాండ్, సోషల్ మీడియాకి సంబంధించిన నేరాలు, కొత్త చట్టాలపై సూళ్లూరుపేట సర్కిల్ అధికారులకు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సూళ్లూరుపేట సర్కిల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులు ముఖ్యంగా సోషల్ మీడియాకు సంబంధించిన నేరాలపై పూర్తిస్థాయిలో చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం ఎస్‌ఐలు కొండప నాయుడు, బ్రహ్మనాయుడు, అజేయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటి నగరోత్సవం



శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల నగరోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక సోమవారాన్ని పుర్కరించుకొని రాత్రి ఊరేగింపు జరిగింది. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. దూప దీప నైవేద్యాల సమర్పణ అనంతరం చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతలు, కొబ్బరికాయలు సమర్పించారు.

శాస్త్రోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన



శ్రీకాళహస్తీశ్వరాలయంలో లక్ష బిల్వ, కుంకుమార్చనలను శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు, అనంతరం తిరిగి సాయంత్రం నాల్గో కాలం అర్చన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో పార్కింగ్ చేస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లారీ అసోసియేషన్ సభ్యులకు సూచనలిస్తున్న డీఎస్పీ

రేణిగుంట, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): విమానాశ్రయానికి వెళ్లే ప్రధాన రహదారి వెంబడి రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చ రించారు. ప్రధాన రహదారిలో లారీ పార్కింగ్‌పై ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'లారీల పార్కింగ్‌కు అడ్డాగా వీఐపీ రహదారులు' కథనానికి స్పందించిన డీఎస్పీ సోమవారం సాయంత్రం లారీ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పాతచెక్‌పోస్టు, కొత్తచెక్‌పోస్టు, రమణవిలాస్ కూడలి, గుత్తివారి పల్లి వరకు పార్కింగ్ చేయడానికి వీలు లేదన్నారు. పార్కింగ్‌కు మరో స్థలం ఎంచుకోవాలని సూచించారు. లారీ బ్రోకర్ ఆఫీసు వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. సీఐ శరత్ చంద్ర, ఎస్‌ఐ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

- టీడీపీ పట్టణ అధ్యక్షుడు బాషా

రేణిగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ఆసరాగా చేసుకుని ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా కొంతమంది వలంటీర్ల దుష్ప్రచారాన్ని నమ్మొద్దని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బాషా పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన వలంటీర్లు కొంతమంది కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పోస్టాఫీసులో ఖాతా పేరుతో మహిళల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా కార్తీక వన మహోత్సవం

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చాముండేశ్వరి చేనేత దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనమహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నీలకంఠేశ్వరాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఉసిరి చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, మిద్దెల హరి, మద్దు శ్రీనివాసులు, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో మ్యారిటైం బోర్డు చైర్మన్



శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం రాష్ట్ర మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. అలాగే ఉదయం టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి స్వామివారి సేవలో పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న సీఐ శరత్ చంద్ర

రేణిగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ శరత్‌చంద్ర సూచించారు. మండలంలోని కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, బాల్యవివాహాలు, సోషల్ మీడియా నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేవీబీపురం ఎస్‌ఐ ఓబయ్య అన్నారు. సోమవారం మండలంలోని వగత్తూరులో ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌సీ బసవయ్య, కానిస్టేబుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండల కేంద్రంలోని ఓం నారాయణ పాఠశాలలో సోమవారం డీఎస్పీ శ్రీనివాసరావు సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫోన్‌లో గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వవద్దన్నారు. అలాగే విదార్థినులు స్వీయ రక్షణ కోసం తగుచర్యలు తీసుకోవాలన్నారు. సీఐ జయచంద్ర, ఎంఈవో ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో నిరంజన్‌కు రజతం



నిరంజన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏర్పేడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి అండర్ 19 జూడో పోటీలు జరిగాయి. ఇందులో 13 ఉమ్మడి జిల్లాలు నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఏర్పేడు మండలం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.నిరంజన్ 40 కిలోల విభాగంలో రజతం సాధించాడు. దీంతో జిల్లాకు ద్వితీయ చాంపియన్‌షిప్ లభించింది. వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పవాణి, ఉపాధ్యాయులు సోమశేఖరరాజు, రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం తదితరులు నిరంజన్‌ను అభినందించారు.

కూనాటి సురేష్‌కు ఘన సన్మానం

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని పెంపొందించేలా బోధన చేయడం, విద్యార్థులో డ్రాపౌట్స్ తగ్గించడం, విద్యా సంబంధమైన ఆర్టికల్స్ రాయడం, చర్చల్లో పాల్గొనడం, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తున్నందుకు కూనాటి సురేష్ అభినందనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి సాంఘికశాస్త్ర దినోత్సవంలో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌ను ఘనంగా సన్మానించారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ రఘువర్మ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిరంజీవి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై ఉక్కుపాదం


నాగలాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యంగా నడుచుకునే ఆకతాయిలపై ఉక్కుపాదం మోపుతామని నాగలాపురం ఎస్‌ఐ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నాగలాపురం మండల పరిధిలోని కారణి జడ్పీ హైస్కూల్ నుంచి ఫిర్యాదులు అందడంతో ఎస్‌ఐ వెంటనే ఆ పాఠశాలకు చేరుకన్నారు. విద్యార్థులను బెదిరించినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పొట్టి ప్లాంట్లు, చిత్రవిచిత్రంగా జుట్టు పెంచుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే పాఠశాల ముగిసిన తరువాత ఆర్టీసీ బస్సులు సరిగా ఆపకపోవడంతో ఇళ్లకు వెళ్లేందుకు ఆలస్యమవుతోందని పలువురు విద్యార్థులు ఎస్‌ఐకి తెలపడంతో ఆర్టీసీ డీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇద్దరు కత్తితో బెదిరిస్తున్నారని చెప్పడంతో వారిని అదుపులోకి తీసుకోవాలని కానిస్టేబుళ్లకు చెప్పారు.

అంగన్‌వాడీకి స్టీల్‌ప్లేట్లు, గ్లాసుల వితరణ

వరదయ్యపాలెం, నవంబరు 25: మండలంలోని బత్తలవల్లం పంచాయతీ రాచకండ్రిగలోని అంగన్‌వాడీ కేంద్రానికి చిలమత్తూరుకు చెందిన వైసీపీ యువ నాయకులు వేనాటి కిషోర్, సునీల్ స్టీల్‌ప్లేట్లు, గ్లాసులను వితరణ చేశారు. వారికి అంగన్‌వాడీ టీచర్ సుగుణ, ఆశా వర్కర్ వాణి కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగుగంగ కార్యాలయంలో పెచ్చులూడుతున్న స్లాబ్

- భయం గుప్పెట్లో సిబ్బంది



కార్యాలయ వరండాలో పెచ్చులూడిన స్లాబ్ - సిబ్బంది పని చేసే గదిలో పెచ్చులూడుతున్న స్లాబ్

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని తెలుగుగంగ సబ్ డివిజనల్ కార్యాలయ భవనం స్లాబ్ పెచ్చు లూడటంతో సిబ్బంది భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనాన్ని 1986లో నిర్మించారు. తెలుగుగంగ కాలువ నిర్మాణ సమయంలో పెద్ద ఎత్తున సిబ్బంది పని చేసేవారు. ప్రస్తుతం ఈ కార్యాలయంలో డీఈ, నలుగురు ఏఈలు మరో ముగ్గురు పని చేస్తున్నారు. భవనం నిర్మించి చాల సంవత్సరాలు కావడంతో దుస్థితికి చేరుకుంది. పని చేసే సమయంలో పెచ్చులూడి ఎక్కడ పడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మార్మోగిన శివనామ స్మరణ



చక్రేశ్వరస్వామి ఆలయంలో మార్కండేయునిపై యమపాశం వేస్తున్న యముడి అలంకారం

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం నాల్గో సోమవారాన్ని పురస్కరించుకుని శైవ ఆలయాల్లో శంభో శంకరా అంటూ భక్తులు మోకరిల్లారు. ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ రెండవ గేటు సమీపంలో మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు దీపారాధనలు సమర్పించారు. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివ నామస్మరణతో ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని జెట్టిపాళెంలో కొలువైఉన్న చక్రేశ్వరస్వామి ఆలయంలో మార్కండేయుడిపై యముడు పాశం వేసిన అలంకారం భక్తులను ఆకట్టుకుంది. పిట్టలవారి సందులో దుర్గమలీశ్వరాలయం, కుందేటివారి వీధిలోని బృహదీశ్వరాలయం, ప్రాజెక్టు వీధి శివాలయం, తొట్టంబేడు మండలం పెద్దకన్నలిలోని వీరభద్రస్వామి ఆలయం, సింగమాలలోని శివాలయం, తొట్టంబేడు శివాలయం, స్వర్ణముఖి నది ఒడ్డున అర్ధనారీశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు దీపారాధనలు సమర్పించారు.

పల్లికొండేశ్వరాలయంలో కార్తీక మాస పూజలు



పల్లికొండేశ్వరాలయంలో నేతిదీపాలు వెలిగిస్తున్న మహిళలు - కీళపూడిలో గంధోత్సవ అలంకరణలో జలకంఠేశ్వరుడు

నాగలాపురం, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాల యంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూలస్థాన దేవతలైన మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ యాగశాల మండపంలో రుద్రహోమం, రుద్రాభిషేకం చేపట్టారు. ఆంధ్ర, తమిళనాడు నుంచి వందల్లో సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని ఆలయ ఆవరణలోని రావి చెట్టు ఎదుట నేతి దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏర్పేడు: మండలంలో ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారతు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను అందించారు. ఈవో రామచంద్రారెడ్డి, వేదపండి తులు పవన్ శర్మ, వంశీకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి వాలీశ్వరస్వామి దేవాలయంతో పాటు కీళపూడి జలకంఠేశ్వరాలయం, సిద్ధిరాజుకండ్రిగలో గౌరీ సమేత సోమనాథ ఈశ్వరాలయంలో కార్తీక సోమవారాన్ని పురస్క రించుకుని అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ



బీఎన్‌కండ్రిగలో డ్వాక్రా సభ్యుల ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలపై లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమాన్ని డ్వాక్రా సభ్యులు చేపట్టారు. మండల వెలుగు సమాఖ్య కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పలు వీధుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ... ఈనెల 25నుంచి డిసెంబరు 23 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

ఏర్పేడు: లింగ ఆధారిత హింసను అరికట్టడానికి కృషి చేస్తామని ఏర్పేడు మండల మహిళా సమాఖ్య సభ్యులు అన్నారు. మహిళలపై లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కుమారుడైనా, కుమార్తె అయినా ఒకే విధంగా పెంచాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వరదయ్యపాళెం, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): మండలంలోని బత్తలవల్లం చెక్‌పోస్టు తడ - శ్రీకాళహస్తి ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు... బత్తలవల్లం చెక్‌పోస్టు వద్ద మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రి మార్చూరీకి తరలించినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించండి

ఏఐటీయూసీ

రేణిగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు జీతం బాకాయిలు చెల్లించాలని సర్పంచు నగేష్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులను పంచాయతీ పరిధిలోనే కాక వివిధ చోట్ల పనులు చేయిస్తూ పనిభారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సక్రమంగా జీతాలు మాత్రం చెల్లించడం లేదన్నారు. సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు బకాయిపడిన జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

వరదయ్యపాళెం, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను సోమవారం శ్రీకాళహస్తి సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రికార్డులు సరిగా లేని రూ.2,86,618 విలువైన పురుగుమందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. రికార్డులు సరిగా నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు బిల్లులు విధిగా ఇవ్వాలని, ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. ప్రతి దుకాణదారుడు ధరల పట్టికను ప్రతిరోజు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు వ్యవసాయాధికారి మురళి, విస్తరణ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, నవంబమరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 27న బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ నరసింహవర్మ తెలిపారు. డిక్సన్ పరిశ్రమలో ఉద్యోగాల కోసం టెన్త్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. 30 సంవత్సరాల లోపు నిరుద్యోగులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పాన్‌కార్డు జిరాక్సులు సహా ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలు, మూడు పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. అదే విధంగా ఎంఆర్ఎఫ్ టైర్స్‌లో ఉద్యోగాల కోసం 35 సంవత్సరాల లోపు వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. వివరాల కోసం నెం.9440502338, 9440019263లలో సంప్రదించ వచ్చు.

చిరు వ్యాపారులకు స్థల పరిశీలన



స్థలపరిశీలనలో అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ వీధి, సినిమావీధిలో ఉన్న చిరువ్యాపారుల కోసం ప్రత్యామ్నాయ స్థలం ఏర్పాటు చేయడంపై అధికారులు కసరత్తు చేశారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘ కమిషనర్ గిరికుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి శారద పట్టణంలోని పలు చోట్ల చిరు వ్యాపారుల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్, సినిమావీధిలో ఏళ్ల తరబడి రోడ్డుపై వ్యాపారం సాగిస్తున్న చిరు వ్యాపారులను అక్కడి నుంచి మార్చాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు జారీ చేశాయని తెలిపారు. ఈ మేరకు ఏఐటీయూసీ నాయకులు గురవయ్య, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్టాండు పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రిరోడ్డులోని స్థలాన్ని అధికారులు, కార్మికసంఘాల నాయకులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోపి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలు గ్రామాల్లో పర్యటించాల్సిందే

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలందరు నిత్యం గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కర వేదికకు 10 గంటలకే వీఆర్వోలందరు చేరుకోవాలన్నారు. వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబు నాయుడు, సర్వేయరు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంపాళెం రోడ్డుకు మరమ్మతులు



గుంతలకు మరమ్మతులు చేపడుతున్న మునిరాజా తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం రోడ్డుకుపై పడిన గుంతలకు సర్పంచు మాచాలమ్మ భర్త మునిరాజా సోమవారం మరమ్మతులు చేపట్టారు. తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కళత్తూరులో సారా ఊట ధ్వంసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

కేవీబీపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు పరిధిలో శ్రీకాళహస్తి ఎక్సైజ్ సీఐ లావణ్య ఆధ్వర్యంలో సోమవారం సారా స్థావరాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఊరు బయట పొదలో ప్లాస్టిక్ పీపాలో దాచి ఉంచిన సుమారు 500 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సారా కాచినా, అమ్మినా చట్టరీత్యా నేరమన్నారు. ఇందుకు సంబంధించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ బాస్కరన్, సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యుంజయుడికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు.